## గూడ్స్ రైల్లో ఎలక్ట్రిక్ ఆటోలు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ తొలిసారిగా గూడ్స్ రైలు (ఎన్ఎంజీ రేకుల) ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలు రవాణా చేశామని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ రవాణా ద్వారా రైల్వేకు ఏక కాలంలో రూ.17.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. హైదరాబాద్ బాలానగర్ రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీలోని బిజ్వాసన్ రైల్వే స్టేషన్ వరకు 1,770 కిలోమీటర్లు ఆటోలను రవాణా చేసినట్టు డీఆర్ఎం లోకేశ్ విష్ణోయ్ తెలిపా తెలిపారు. ప్రయాణికులకు సంబంధించిన కొన్ని బోగీలను ఎన్ఎంజీలుగా మార్చి వాటి ద్వారా కార్లు, ఆటోలు, మోటర్ సైకిళ్లు, స్కూటర్లతోపాటు తేలికపాటి వాణిజ్య వాహనాలు కూడా రవాణా చేయనున్నట్టు పేర్కొన్నారు.

## ఆటోకు పండుగ కిక్కు

న్యూఢిల్లీ, నవంబర్ 15: దేశీయ ఆటోమొబైల్ సంస్థలకు పండుగ సీజన్ కలిసొచ్చింది. ఈసారి 42 రోజుల పాటు సాగిన పండుగ సీజన్‌లో 42.88 లక్షల యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన 38,37,040 వాహనాలతో పోలిస్తే 12 శాతం అధికమయ్యాయని డీలర్ల అసోసియేషన్ ఫాడా వెల్లడించింది. నవరాత్రి ఉత్సవాలతో ప్రారంభమైన పండుగ సీజన్ దీపావళి వరకు కొనసాగిందని, ఈ సమయంలో 42.88 లక్షల యూనిట్ల వాహనాలు రిజిస్టార్ అయ్యాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. ప్యాసింజర్ వాహన రిటైల్ 7 శాతం పెరిగి 6,03,009 యూనిట్లకు చేరుకోవడం కలిసొచ్చిందన్నారు. పండుగ సీజన్‌తోపాటు పలు సంస్థలు భారీగా రాయితీలు ఇవ్వడం కూడా విక్రయాలు పెరగడానికి దోహదం చేశాయన్నారు. దక్షిణాదిలో అకాల భారీ వర్షాలు కురియడంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వాహన అమ్మకాలు పెద్దగా పెరగలేదన్నారు. అమ్ముడైన వాహనాల్లో ద్విచ క్ర వాహనాలు 14 శాతం పెరిగి 33,11,325 యూనిట్లకు చేరుకోగా, కమర్షియల్ వాహన సేల్స్ 1 శాతం పెరిగి 1,28,738లకు, త్రిచక్ర వాహన సేల్స్ 7 శాతం అధికమై 1,59,960కి చేరుకున్నాయి. కానీ, ట్రాక్టర్ల అమ్మకాలు 2 శాతం తగ్గి 85,216 యూనిట్లకు పడిపోయాయి.

# గోల్డ్‌కు ట్రంప్ గుబులు

- దేశీయ విపణిలో క్రమేణా క్షీణిస్తున్న ధరలు
- గత 10 రోజుల్లో తులం రూ.5,350 తగ్గుదల
- అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపుతో మార్కెట్ రివర్స్‌గేర్



న్యూఢిల్లీ, నవంబర్ 15: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం.. గోల్డ్ మార్కెట్ పతనానికి దారితీస్తున్నది. ఈ నెల 4న ట్రంప్ గెలిచినట్టు అధికారికంగా వెల్లడైన విషయం తెలిసిందే. అయితే అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) బంగారం ధర రూ.5,350 (6.5 శాతం) పడిపోవడం గమనార్హం. డాలర్ ఇండెక్స్ (డీఎక్స్‌వై) అంతకంతకూ బలపడుతుండటం.. బులియన్ మార్కెట్‌ను బేరిష్ ట్రెండ్‌లోకి నెడుతున్నది. ప్రస్తుతం తులం రూ.77వేల దరిదాపుల్లో ఉన్నది. గత నెలాఖరున మునుపెన్నడూ లేనివిధంగా రూ.82,400 పలికిన సంగతి విదితమే. హైదరాబాద్‌లో తులం 22 క్యారెట్ రేటు రూ.70వేలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివరిదాకా డౌన్‌ట్రెండ్ కొనసాగవచ్చన్న అంచనాలే వినిపిస్తున్నాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక, పాలసీ నిర్ణయాలు వచ్చేదాకా గోల్డ్ రేట్ కరెక్షన్ ఉంటుందంటున్నారు.

### ఎందుకింత ఒత్తిడి?

గత 10 రోజులుగా బంగారం ధరలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. బహిరంగ మార్కెట్‌తోపాటు కమోడిటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్ లోనూ ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ట్రంప్ విధానాలను గమనిస్తే.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టారు. అమెరికాకు చైనా నుంచి వచ్చే వస్తూత్పత్తులపై అధిక సుంకాలు విధించడం, వీసా విధానాన్ని కఠినతరం చేయడం వంటివి వీటిలో ఉన్నాయి. మళ్లీ జనవరి నుంచి ఆయనే అధ్యక్షుడిగా రానుండటంతో అమెరికా ఎకానమీపై ముఖ్యంగా ఆ దేశ కరెన్సీ డాలర్‌కు ఎక్కడలేని డిమాండ్‌ను తెచ్చిపెడుతున్నది. దీంతో పెట్టుబడులన్నీ స్టాక్స్, బాండ్ల మార్కెట్ వైపు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా పసిడికి ఆదరణ తగ్గి ధరల క్షీణత చోటు చేసుకుంటున్నది.

### ప్రభావితాంశాలివే..

### బిట్‌కాయిన్

**బిట్**‌కాయిన్‌పట్ల మదుపరులు చూపిస్తున్న అమితాసక్తి కూడా గోల్డ్ మార్కెట్ క్రాష్‌కు దారితీస్తున్నది. ఈ వర్చువల్ కరెన్సీకి అమెరికా మద్దతు ఉండబోతుందన్న అంచనాలే ఇందుకు కారణం. ఈ క్రమంలోనే తరలివస్తున్న పెట్టుబడులతో మళ్లీ ఆల్‌టైమ్ హైల్లోకి బిట్‌కాయిన్ విలువ వెళ్లింది. ప్రస్తుతం విలువ 89వేల డాలర్లపైనే పలుకుతున్నది.

### ఈక్విటీ మార్కెట్లు

**స్టాక్** మార్కెట్లలో నష్టాలను, ఒడిదొడుకులను తట్టుకొనేందుకు ఇన్వెస్టర్లు ఎంచుకొనే సురక్షిత పెట్టుబడి మార్గమే బంగారం. అయితే ప్రస్తుతం మారిన ట్రెండ్‌తో ఇన్నాళ్లూ పెట్టిన పెట్టుబడులను గోల్డ్ మార్కెట్ నుంచి మదుపరులు వెనక్కి తీసుకుంటున్నారు. రిస్క్ ఎక్కువగా ఉన్నా ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధమైపోతున్నారు. ఈటీఎఫ్‌ల నుంచి తరలిపోతున్న నిధులే ఇందుకు నిదర్శనం.

### ఉద్రిక్తతలు తగ్గుతాయని..

**యూరప్**‌తోపాటు పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతాయన్న అంచనాలు కూడా పసిడి ధరల్ని కిందకు లాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైతే రాజకీయ, భౌగోళిక పరిస్థితుల్లో మార్పు ఉంటుందన్న విశ్వాసం మెజారిటీ మదుపరుల్లో కనిపిస్తున్నది.

### డాలర్ ఇండెక్స్

**ట్రంప్** గెలుపుతో ప్రపంచ కరెన్సీగా పేరున్న అమెరికా డాలర్లకు భారీగా డిమాండ్ వచ్చిపడింది. ఈ క్రమంలోనే డాలర్ ఇండెక్స్ పరుగులు పెడుతున్నది. దేశీయ మార్కెట్ నుంచి గతకొద్ది రోజులుగా తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం అమెరికన్ మార్కెట్లలోకే చేరుతున్నాయి.

### గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి ధరలు నేలచూపుల్నే చూస్తున్నాయి. ఔన్సు గోల్డ్ విలువ రికార్డు స్థాయిల నుంచి దిగజారింది. కొమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2,557.40 డాలర్లు పలికింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తుండటం కూడా పుత్తడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది.

# దిద్దుబాటు దిశగా మార్కెట్లు

- ఆల్‌టైమ్ హై నుంచి 10 శాతానికి పైగా క్షీణించిన దేశీయ ఈక్విటీలు

న్యూఢిల్లీ, నవంబర్ 15: ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లు ఎన్నో కొత్త రికార్డులను నెలకొల్పాయి. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) రెండూ ఆల్‌టైమ్ హైలతో అదరగొట్టాయి. అయితే ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. గతకొద్ది రోజులుగా సూచీలు వరుస నష్టాలకే పరిమితమవుతున్నాయి మరి. ఈ క్రమంలోనే సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిల నుంచి గమనిస్తే.. సెన్సెక్స్, నిఫ్టీలు 10 శాతానికిపైగా పడిపోయాయి. మరికొద్ది రోజులూ దిద్దుబాటు దిశగానే ఈక్విటీ మార్కెట్లు పయనించవచ్చన్న అంచనాలున్నాయి.

### ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. వాటిలో చైనా ఉద్దీపనలతో విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్ నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుపోతుండటం కూడా ఉన్నది. గత నెలలోనే రూ.94,000 కోట్లు తరలిపోయాయి. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటిస్తున్న నిరాశాజనక ఆర్థిక ఫలితాలూ కారణమే. అంతేగాక మదుపరుల లాభాల స్వీకరణ, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, డాలర్ ఇండెక్స్ పరుగులు పెడుతుండటం కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై 85,978.25 పాయింట్లను చేరింది. తొలిసారి నిఫ్టీ కూడా 26,277.35 పాయింట్లను తాకింది. అయితే అక్టోబర్ నుంచి మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ మొదలైంది. ఈ క్రమంలోనే ఆల్‌టైమ్ హై స్థాయి నుంచి చూస్తే ప్రస్తుతం సెన్సెక్స్ 8,397.94 పాయింట్లు లేదా 9.76 శాతం కోల్పోయింది. నిఫ్టీ సైతం 2,744.65 పాయింట్లు లేదా 10.44 శాతం పడిపోయింది.

## సింగరేణి అదుర్స్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థ లాభాల్లో దూసుకెళుతున్నది.ఈ ఏడాది మొదటి అర్ధభాగంలోనే అధనంగా వెయ్యికోట్లకు పైగా లాభాలు గడించినట్టు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్యకాలానికిగాను పన్ను చెల్లింపులకు ముందు రూ. 4 వేల కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించినట్టు పేర్కొన్నారు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,932 కోట్లతో పోలిస్తే 36 శాతం అధికమని చెప్పారు. అలాగే బొగ్గు అమ్మకాల ద్వారా రూ.17,152 కోట్లు, విద్యుత్తు విక్రయాల ద్వారా రూ.2,286 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో అలెగ్రో పరిశోధన కేంద్రం

500 మంది సిబ్బందిని నియమించుకోనున్న సంస్థ



హైదరాబాద్, నవంబర్ 15: అమెరికాకు చెందిన మ్యాగ్నెటిక్ సెన్సింగ్ అండ్ పవర్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్(ఐసీ) సొల్యూషన్స్ సంస్థ అలెగ్రో మైక్రోసిస్టమ్స్..హైదరాబాద్‌లో రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్(ఆర్అండ్‌డీ)ని ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో వినీత్ నార్గోల్‌వాలా మాట్లాడుతూ..అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలోభాగంగానే హైదరాబాద్‌లో నూతన ఆర్అండ్‌డీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు, తెలంగాణలో శక్తివంతమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థలో భాగమైనందుకు సంతోషంగా ఉన్నదని, అలాగే దేశీయ సెమీకండక్టర్ ఆశయాలకు తమవంతుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. నగరంలో ప్రతిభ కలిగిన ఉద్యోగులకు కొదవ లేదని, అనుకూల ప్రభుత్వ పాలసీలతో ఇక్కడి విస్తరణకు అనుకూలంగా మారిందన్నారు. ప్రస్తుతం ఆర్అండ్‌డీ కోసం 100 మంది ప్రతిభ కలిగిన సిబ్బందిని నియమించుకున్నట్లు, సమీప భవిష్యత్తులో ఈ సంఖ్యను 500కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజాలైన బీఎండబ్ల్యూ, అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థలకు అలెగ్రో మైక్రోసిస్టమ్స్ కీలక విడిభాగాలను సరఫరా చేస్తున్నది.

## ఆగని ఫారెక్స్ నిల్వల పతనం

ముంబై, నవంబర్ 15: విదేశీ మారకం నిల్వలు మరింత కరిగిపోయాయి. ఈ నెల 8తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 6.477 బిలియన్ డాలర్లు తరిగిపోయి 675.653 బిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితంవారంలోనూ నిల్వలు 2.675 బిలియన్ డాలర్లు తగ్గి 683.13 బిలియన్ డాలర్లకు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 4.467 బిలియన్ డాలర్లు కరిగిపోయి 585.383 బిలియన్ డాలర్లకు పడిపోవడం వల్లనే మొత్తం రిజర్వులపై ప్రతికూల ప్రభావం పడిందని రిజర్వు బ్యాంక్ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. అలాగే గోల్డ్ రిజర్వులు 1.936 బిలియన్ డాలర్లు తగ్గి 67.814 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

## ప్రియంకానున్న బెంజ్ కార్లు

జనవరి 1 నుంచి 3 శాతం వరకు పెరగనున్న ధరలు



న్యూఢిల్లీ, నవంబర్ 15: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్ మరోసారి కార్ల ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల కార్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికమవడం, ద్రవ్యోల్బణం ఒత్తిడి, నిర్వహణ ఖర్చులు అధికమవడం వల్లనే కార్ల ధరలను పెంచాల్సి వస్తున్నదని పేర్కొం ది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో జీఎల్‌సీ మాడల్ రూ.2 లక్షల వరకు అధికమవనుండగా, టాప్-ఎండ్ మాడల్ మేబ్యాక్ ఎస్680 లగ్జరీ కారు రూ.9 లక్షల వరకు పెరగనున్నది. గడిచిన మూడు త్రైమాసికాలుగా ముడి సరుకుల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ముఖ్యంగా కమోడిటీ ఉత్పత్తుల ధరలు 10 శాతానికి పైగా అధికమయ్యాయని, దీంతోపాటు లాజిస్టిక్ ఖర్చులు కూడా పెరిగాయని మెర్సిడెజ్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ తెలిపారు. డిసెంబర్ 31 లోపు బుకింగ్‌చేసుకున్న వాహనాలకు ఈ ధరల పెంపు నుంచి మినహాయింపు లభించనున్నదన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.45 లక్షల నుంచి రూ.3.6 కోట్ల లోపు పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

# ఒక్క గింజ కొనలే..

- 20 రోజులుగా కల్లాల్లోనే వడ్లు
- కేంద్రాల్లో 600 క్వింటాళ్లకు పైగా ధాన్యం
- 189 కేంద్రాలకు 151 ప్రారంభం
- ప్రారంభించిన వాటిల్లోనూ కొనుగోలు లేదు
- 11 మిల్లులకు అలాట్‌మెంట్
- సీఎంఆర్ పూర్తి చేయని 15 మిల్లులకు పెండింగ్
- ప్రైవేటు మిల్లులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు



మొగుళ్లపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం

జయశంకర్ భూపాలపల్లి. నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఒక్క ధాన్యం గింజ ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. పలు గ్రామాల్లో వరి కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతుండగా కోతలు పూర్తై కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం గత 20 రోజులుగా తూకానికి నోచుకోవడం లేదు. ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఒక ప్యాడీ క్లీనర్‌ను అప్పగించారు. ఒక్క క్లీనర్‌తో కేంద్రంలోని ధాన్యం మొత్తంను శుభ్రం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 189 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఇప్పటి వరకు 151 కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ఒక్క కేంద్రం నుంచీ ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదు. జిల్లాలోని మొత్తం 26 రైస్ మిల్లులకు ధాన్యం అలాట్ చేయగా ఇందులో 15 మిల్లులు సీఎంఆర్ పెండింగ్ ఉండడంతో అధికారులు వాటికి అలాట్‌మెంట్ ఇవ్వకుండా పక్కకు పెట్టారు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరుగుతుండడంతో రైతులు ప్రైవేట్ మిల్లుల్లో ధాన్యం విక్రయాలు జరుపుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. వర్షాలు వస్తే మొదటికే మోసం వస్తుందని భావించిన రైతులు ప్రైవేట్ మిల్లులను ఆశ్రయిస్తున్నారు.

### కొనుగోలు ఎప్పుడో ?

జిల్లాలో ప్రస్తుతం 151 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క కేంద్రంలోనూ కొనుగోలు ప్రారంభం కాలేదు. మొగుళ్లపల్లి, టేకుమట్లతో పాటు వరి కోతలు కొనసాగుతుండగా ధాన్యం కేంద్రాలకు చేరుతుండగా, కొందరు ప్రైవేటు మిల్లుల్లో విక్రయాలు జరుపుతున్నారు. మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోకి ప్రస్తుతం సుమారు 600 టన్నుల వరకు ధాన్యం చేరుకుందని అధికార వర్గాలు చెప్తున్నాయి. కేంద్రాలకు ఎలక్ట్రానిక్ కాంటాలు, టార్ఫాలిన్లు, బారదాన్ చేరగా ధాన్యాన్ని తాలు లేకుండా పూర్తిగా శుభ్రం చేసి తేమ శాతం 17 ఉంటేనే ఏఈవో పరిశీలించి టోకెన్ ఇస్తేనే బారదాన్ ఇస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఈ లోగా వర్షాలు వచ్చి తడిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

### 28న ధాన్యం తెచ్చిన



మొగుళ్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి గత నెల 28న వడ్లు తీసుక వచ్చిన. అప్పటి నుండి వడ్లు ఆరబెడుతూనే ఉన్న. మిషన్‌తోని శుభ్రం చేస్తేనే కొంటరట. మిషన్ మొన్ననే వచ్చింది. ఒకొక్కల వడ్లు శుభ్రం చేసేసరికి ఎన్ని రోజులు పడుతదో. ఇప్పుడు వడ్లు ఆరినయ్. వర్షం వస్తే మల్ల తేమ వస్తది. తొందరగా కొనుగోలు చేయాలె.

**– బండారి మల్లేశం, రైతు, మొగుళ్లపల్లి**

### 15 మిల్లులకు పెండింగ్

జిల్లాలోని 26 రైస్ మిల్లులకు ప్రభుత్వం ధాన్యం అలాట్ చేసినప్పటికీ ఇందులో 15 మిల్లులు సీఎంఆర్ పూర్తి చేయకపోవడంతో వీటిని అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం 11 మిల్లులకు మాత్రమే అలాట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. ప్రభుత్వం ఈ నెల 30 వరకు సీఎంఆర్ క్లియరెన్స్‌కు గడువు ఇచ్చిందని, ఈ లోగా సీఎంఆర్ క్లియర్ చేస్తే అలాట్‌మెంట్ ఆర్డర్ ఇస్తామని అధికారులు తెలుపుతున్నారు. ఒడితెల కొత్తపల్లికి చెందిన మేఘన రైస్‌మిల్, పెద్దాపూర్‌కు చెందిన అమ్మ రైస్ మిల్, రేగొండ మండలం భాగిర్థిపేటకు చెందిన దుర్గాభవాని మిల్లులు సీఎంఆర్ పెండింగ్ ఎక్కువగా ఉందని, మిగిలిన మూడు మిల్లులు 85 శాతం పూర్తి చేశారని అధికారులు తెలిపారు. గడువులోగా మిల్లులు సీఎంఆర్ కంప్లీట్ చేయకపోతే గణపురం, కాటారం, రేగొండలోని గోదాంలకు ధాన్యాన్ని తరలిస్తామని పౌరసరఫరాల శాఖ మేనేజర్ రాములు తెలుపుతున్నారు.


## కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

మహాదేవపూర్ (కాటారం) , నవంబర్ 15 : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని బొమ్మపూర్, ఎల్కేశ్వరం, బెగ్లూర్‌రు, సూరారం అంబటిపల్లి, ఎన్కపల్లి, రాపల్లి కోట, పెద్దంపేట, కుదురుపల్లి, ఎడపల్లి, బ్రాహ్మణపల్లి , కాటారం మండలంలో చేపట్టిన సమగ్ర సర్వే కొనసాగుతోంది. శుక్రవారం ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ యజమానుల ఆర్థిక, సామాజిక తదితర వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కల్పన, దామోదర్‌రెడ్డి, అంజలిరెడ్డి, మహేశ్, రమేశ్, ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



సర్వేలో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

కృష్ణకాలనీ, నవంబర్ 15 : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మైనార్టీ బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం గ్రంథాలయ సిబ్బంది పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయగా మైనార్టీ బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకా ల్లో విజ్ఞాన నిధి దాగి ఉందని, దానిని చదివి జ్ఞానాన్ని పొంది జీవితంలో ఉన్నత స్థాయిలోకి ఎదగాలన్నారు. పుస్తకాలను చదివితే జీవితం, సమాజంలో ఉన్న అజ్ఞానం అనే చీకటి పోయి, జ్ఞానం అనే వెలుగు వస్తుందన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రకాల పుస్తకాలు ప్రదర్శించినట్లు లైబ్రేరియన్ టీ చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఈ శారద, పీ రవీందర్ బీ రాకేశ్, కే మంజుల, పాఠకులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా సమన్వయాధికారిగా సదానందం గౌడ్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 15 : ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయ అధికారిగా ఆనగోని సదానందం గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సదానందంగౌడ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నిజాంపల్లి ఎంపీపీఎస్‌లో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం హనుమకొండ జల్లా విద్యాశాఖాధికారి వాసంతిని మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు.

## వైభవంగా బుగులోని జాతర

- ప్రత్యేక ఆకర్షణగా ప్రభబండ్లు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

రేగొండ, నవంబర్ 15 : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని తిరుమలగిరి పాండవుల గుట్టలపై శుక్రవారం బుగులోని జాతర వైభవంగా ప్రారంభమైంది. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. వీరు మూడు రోజల పాటు ఇక్కడే ఉంటూ ఉత్సవాలను తిలకిస్తారు. కోరిన కోరికలు తీర్చే వేంకటేశ్వరస్వామికి ఏనుగు, మేకలు, ప్రభబండ్లు తయారు చేసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. పిల్లల నుంచి మొదలు వయో వృద్ధుల వరకు గుట్టలు ఎక్కి స్వామిని దర్శించుకున్నారు.

### భక్తులకు తప్పని ఇక్కట్లు...

భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్వామివారి దర్శనానికి 2 నుంచి 3 గంటల సమయం పటింది. దీంతో కొందరు దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగి వచ్చారు వలంటీర్లు లేకపోవడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. జాతరకు ప్రతి ఏటా లక్షల రూపాయల్లో ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించకపోడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో పోలీస్ క్యాంపు ఏర్పాటు చేయగా రేగొండ ఎస్సై సందీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో బిళ్ల శ్రీనివాస్, జాతర చైర్మన్ రొంటల వెంకటస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.




గండ దీపంలో నూనె పోస్తున్న భక్తులు

### దర్శించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

వేంకటేశ్వరుడిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనతరం జాతర ఏర్పాట్లును పరిశీలించారు. వారివెంట ఎన్ఎస్ఆర్ సంస్థల ఆదినేత నాయినేని సంపత్‌రావు, గుంటోజు కిష్టయ్య, గాజర్ల ఐతు, పత్తి ప్రభాకర్, వావిలాల రమేశ్, మట్టిక సంతోష్, పాతపెల్లి సంతోష్, నడిపెల్లి వెంకట్రావ్, గోపు రాంరెడ్డి, నిలింబరం ఉన్నారు.



జాతరలో ఆకర్షణగా నిలిచిన ఏనుగు ప్రభ బండి



స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

